క్లుప్తంగా

డాక్టరేట్ పొందిన రమేశ్‌కు అభినందన



సంగెం : మండలంలోని ఎల్గూర్‌స్టేషన్ శివారు రామచంద్రునాయక్ తండాకు చెందిన గుగులోత్ రమేశ్ చరిత్ర విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ అందుకోగా ఆయన్ను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి గురువారం అభినందించారు. తొలుత రమేశ్‌కు ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి శాలువా కప్పి స్వీట్స్ తినిపించారు. భవిష్యత్‌లో మరింత ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గుగులోత్ వీరమ్మ, నాయకులు గోపీసింగ్, నర్సింహనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజేపీలో వైద్యశిబిరం



దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలోని మహాత్మ జ్యోతిరావుపూలే (ఎంజేపీ) బాలుర గురుకుల విద్యాలయంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి రవీందర్ 270 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మృదుల, ప్రిన్సిపాల్ ఓదెల మల్లయ్య, ఏఎన్‌ఎం దివ్య, ఫార్మాసిస్ట్ అన్నపూర్ణ, హెల్త్ సూపర్‌వైజర్ శారద తదితరులు పాల్గొన్నారు.

గుడ్డెలుగులపల్లిలో ఉచిత పశు వైద్య..



మండలంలోని గుడ్డెలుగులపల్లిలో నిర్వహించిన పశు వైద్యశిబిరంలో స్థానిక పశు వైద్యాధికారి సోమశేఖర్ ఆవులు, గేదెలు, దూడలకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పుట్టిన దూడకు గంటలోపు జున్ను పాలు తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ఆవుల్లో 24 గంటలు, గేదెల్లో 36 గంటలు ఎద ఉంటుందని చెప్పారు. ఆ సమయంలో కృత్రిమ గర్భధారణ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో తిమ్మంపేట పశు వైద్యాధికారి బాలాజీ, గోపాలమిత్ర సూపర్‌వైజర్ జహంగీర్, గోపాలమిత్రలు కుమారస్వామి, మధుకర్, అక్బర్, ప్రసాద్, రాజ్‌కుమార్, శివ, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీబీబీఎస్ మండల అధ్యక్షుడిగా విజయకుమార్

వర్ధన్నపేట : వర్ధన్నపేటకు చెందిన చెన్న వెంకటేశ్వర్లును తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం (టీబీబీఎస్) మండల అధ్యక్షుడిగా రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయకుమార్ నియమించారు. ఈ మేరకు వెంకటేశ్వర్లుకు విజయ్‌కుమార్ పట్టణంలో గురువారం విజయ్‌కుమార్ నియామక పత్రం అందజేశారు. అనంతరం విజయ్‌కుమార్ మాట్లాడారు. బీసీ కుల సంఘాలను కులాలకు అతీతంగా చైతన్యవంతం చేస్తామన్నారు. బీసీల హక్కుల సాధన కోసం కృషి చేస్తున్న క్రమంలోనే వెంకటేశ్వర్లును పదవికి ఎంపిక చేసినట్టు తెలిపారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడారు. బీసీల హక్కుల సాధనకు పాటుపడతానని చెప్పారు.

డప్పు కళాకారుల కమిటీ ఎన్నిక



పర్వతగిరి : మండలంలోని కొంకపాకలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘం కమిటీని ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కేతపాక రాజు గురువారం ప్రకటించారు. అధ్యక్షుడిగా బొడ్డు రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడుగా గద్దల వివేక్, కార్యదర్శిగా మాదాసి రాకేశ్, కోశాధికారిగా మాదాసి కవిరాజు, కార్యవర్గ సభ్యులుగా మాదాసి స్వామి, బొక్కల రవీందర్, బొక్కల దేవేందర్, మాదాసి సమ్మయ్య, మాదాసి ప్రేమ్‌సాగర్, మంకాల సిద్దు, మల్లెపాక అర్జున్, కుమారస్వామి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య

ఆత్మకూరు : అనారోగ్యంతో బాధపడుతూ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పరికిరాల రాజయ్య (50) రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి అనారోగ్యం పాలయ్యాడు. ఇతర అనారోగ్య సమస్యలు కూడా ఉండటంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య రాజేశ్వరి, ఇద్దరు పిల్లలున్నారు.

‘కార్పొరేట్’కు దీటుగా ప్రభుత్వ కళాశాల

- విద్య, ఆరోగ్యం, క్రమశిక్షణపై ప్రత్యేక దృష్టి
- దాతల సహకారంతో యూనిఫాం, మధ్యాహ్న భోజనం

సంగెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలకు దీటుగా నడుస్తోంది. విద్యార్థుల విద్య, ఆరోగ్యం, క్రమశిక్షణపై ప్రిన్సిపాల్ కాక మాధవరావు, స్టాఫ్ సెక్రటరీ విజయనిర్మల, అధ్యాపకులు ప్రత్యేక దృష్టి సారించడం ప్రత్యేకతగా చెప్పవచ్చు. విద్యార్థులు పేద కుటుంబాలకు చెందిన వారే కావడంతో వారికి దాతల సహకారంతో యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. 73 మంది ప్రథమ, 70 మంది ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. గత సెప్టెంబర్‌లో దాతల సహకారంతో 40 మంది పేద విద్యార్థులకు దాతల సహకారంతో యూనిఫారం సమకూర్చగా మిగతా విద్యార్థులు సొంతగా కుట్టించుకున్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ పెరిగింది. చాలా మార్పు వచ్చింది. కళాశాల సమయంలో విద్యార్థులు బయట కనిపించడం చాలా అరుదు. ఎవరైనా బయట కనిపిస్తే ప్రిన్సిపాల్, అధ్యాపకులు పర్యవేక్షించి పరిశీలిస్తున్న పరిస్థితి నెలకొంది.

చదువుపై ఏకాగ్రత....


విద్యార్థుల్లో చాలా మంది పేద కుటుంబాలకు చెందిన వారే. కొంత మంది అర్ధాకలితో కళాశాలకు



భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

వచ్చి నీరసపడి చదువుపై శ్రద్ధ చూపలేని దుస్థితి ఉండేది. ఈ క్రమంలో దాతల సహకారంతో డిసెంబర్ నుంచి కళాశాలలో విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజనం మొదలుపెట్టారు. రికార్డ్ అసిస్టెంట్ రమాదేవి, టైపిస్ట్ సదయ్య స్వయంగా వంట చేస్తుండగా అటెండర్ లక్ష్మి కూరగాయలు తరుగుతోంది. స్వీపర్ సమ్మయ్య వంట సామగ్రి శుభ్రం చేస్తూ తోడ్పాటు అందిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు ఇంటిని తలపించేలా శుచి, శుభ్రత కలిగిన భోజనం అందుతోంది. గతంలో 40 శాతంగా ఉన్న హాజరు 80 శాతానికి పెరిగింది. కళాశాల ముగిసిన తర్వాత రోజుకోకరు చొప్పున అధ్యాపకుల పర్యవేక్షణలో విద్యార్థులకు ఒక గంట పాటు స్టడీ అవర్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ద్యార్థుల్లో మరింత మార్పు స్పష్టంగా కనిపిస్తోంది.

దాతల సహకారం అభినందనీయం



కళాశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజనం, ఇతరత్రా సదుపాయాల కల్పనలో దాతల సహకారం అభినందనీయం. పేదరికం నేపథ్యంలో కొందరు విద్యార్థులు అర్ధాకలితో కళాశాలకు హాజరై నీరసపడి పోతున్నట్టు గమనించిన క్రమంలో దాతల సహకారంతో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలన్న ఆలోచనకు అంకురార్పణ జరిగింది. అధ్యాపకుల్లో సమన్వయం, విద్యార్థులకు అవసరమైన సదుపాయాలపై చర్చలు సత్ఫలితాలిస్తున్నాయి. అధ్యాపకులు రోజుకొకరు చొప్పున అదనంగా సమయం కేటాయించి విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహిస్తూ మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేస్తున్నారు. దాతలు, అధ్యాపకుల తోడ్పాటుతో యూనిఫాం సమకూర్చాం. మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం.

- కాక మాధవరావు, ప్రిన్సిపాల్

ఇంటి వద్ద తల్లితండ్రులు, కళాశాలలో అధ్యాపకులు తీసుకుంటున్న చొరవ విద్యార్థులను మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ప్రోత్సహిస్తోందంటే అతిశయోక్తి లేదు.

రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయం



వర్ధన్నపేట : మాట్లాడుతున్న డీపీఎం దయాకర్



వర్ధన్నపేట : మాట్లాడుతున్న ఎస్సై రాజు

- సెర్ప్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ దయాకర్

వర్ధన్నపేట : రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు డీఆర్‌డీఏ సెర్ప్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మునిగాల దయాకర్ తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మండలంలోని సెర్ప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన బృందావన మండల మహిళ గ్రామైక్య సంఘం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వాహనదార్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు వాహనాలకు సంబంధించి పత్రాలు కలిగి ఉండాలని, నిబంధనలు పాటించాలని కోరారు. మైనర్లు వాహనం నడిపితే తల్లిదండ్రులపైనా చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో ఏపీఎం వేణు, బీపీఎం అశోక్, మండల సమైక్య అధ్యక్ష కార్యదర్శులు అరుణ, సునీత, సీసీలు గోలి కొమురయ్య, రమేశ్, స్వామి, అనిల్, గ్రామైక్య సంఘాల ప్రతినిధులు బొంతల మౌనిక, పద్మ, నజీమా, శ్వేత, స్వప్న, రజిత, వనిత, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట రూరల్ : మాట్లాడుతున్న ఎస్సైఅరుణ్

డ్రెస్ కోడ్ ఉండాలి

వర్ధన్నపేట : ఆటోడ్రైవర్లు డ్రెస్‌కోడ్ ధరించాలని ఎస్సైలు చందర్, రాజు చెప్పారు. పట్టణంలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై వారు అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణకు సహకరించాలని కావాలని కోరారు. వాహన ఫిట్‌నెస్, ఇతర పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు.

సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించొద్దు

నర్సంపేట రూరల్ : కాలేజీ బస్సుల్లో సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించొద్దని రూరల్ ఎస్సై అరుణ్ సూచించారు. నర్సంపేట మండలంలోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో బస్సు డ్రైవర్లకు ఆయన అవగాహన కల్పించారు. అతివేగం ప్రమాదకరమని తెలిపారు.

జీవన ఎరువులతో అధిక దిగుబడి

- ఏఓ రజిత

నల్లబెల్లి : జీవన ఎరువులతో పంట సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) బన్న రజిత తెలిపారు. జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో పలువురు రైతులకు ఆమె ప్రభుత్వం సబ్సిడీపై అందించిన వరి విత్తనాలు, జీవన ఎరువులను గురువారం పంపిణీ చేసి మాట్లాడారు. రసాయన, కాంప్లెక్స్ ఎరువులు 30 శాతం తగ్గించి వాడుకోవాలని సూచించారు. సాల్యుబులైజింగ్ బ్యాక్టీరియా (పీఎస్‌బీ) భాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియా 50 శాతం, ఆర్‌ఎన్‌ఆర్-15048, ఎంటీయూ-1010 రకం వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అర్హులైన రైతులకు సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. రైతులు జీవన ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు.



విత్తనాలు, జీవన ఎరువు అందిస్తున్న ఏఓ రజిత

అటెన్షన్ ప్లీజ్



రోడ్డు పక్కనే పెంట

అమీనాబాద్‌లో రోడ్డు పక్కనే పశువుల పెంట వేస్తుండడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామం నుంచి పత్తినాయక్‌తండా వెళ్లే దారిలో ప్రధాన రహదారి పక్కనే కొందరు చెత్తాచెదారం, పశువుల పెంట కుప్పగా పోయడంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. ప్రభుత్వం, అధికారులు ప్రతిష్ఠాత్మకంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తుండగా కొందరు అందుకు భిన్నంగా అపరిశుభ్ర వాతావరణాన్ని కల్పిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డు పక్కనే ఉన్న చెత్తాచెదారాన్ని, పశువుల పెంటను తొలగించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- చెన్నారావుపేట

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
నిట్టు, పంచాయతీ కార్యదర్శి
ఫోన్‌నంబర్ : 8106950834

ఇంటర్ పరీక్షల్లో సీసీ కెమెరాల నిఘా

- కళాశాల ప్రిన్సిపాల్ జయకుమారి

రాయపర్తి : సీసీ కెమెరాల నిఘాలో ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్టు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జయకుమారి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ కళాశాలలో గురువారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. కళాశాల పరిసరాల్లో అసాంఘిక శక్తుల సంచారాన్ని అరికట్టేలా పోలీసు అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. ఇంటర్ బోర్డు ఆదేశాలతో 90 రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నట్టు చెప్పారు. వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ చాటేలా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని ఆకాంక్షించారు.



కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్న ప్రిన్సిపాల్



చెన్నారావుపేట : పుస్తకాలు ఇస్తున్న బాలకృష్ణ



సంగెం : ఎస్టీ హాస్టల్‌లో..

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

సంగెం/చెన్నారావుపేట/నెక్కొండ : సంగెం ఎస్టీ హాస్టల్‌లో తహసీల్దార్ రాజ్‌కుమార్, కేజీబీవీలో ఎంపీడీఓ రవీందర్ పదో తరగతి విద్యార్థులకు గురువారం పరీక్ష ప్యాడ్‌లు, పాకెట్ డిక్షనరీలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర మెటీరియల్ పంపిణీ చేశారు. అలాగే చెన్నారావుపేట సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో ప్రత్యేక అధికారి బాలకృష్ణ, ఎంపీడీఓ శ్రీవాణి విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ అందజేశారు. నెక్కొండ కేజీబీవీలో 10వ తరగతి విద్యార్థులకు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ప్రత్యేక అధికారి అనురాధ పరీక్ష మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా సదరు తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓలు రవీందర్, శ్రీవాణి, ప్రత్యేక అధికారులు బాలకృష్ణ, అనురాధ మాట్లాడారు. విద్యార్థులు వార్షిక పరీక్షల్లో మెరుగైన గ్రేడింగ్ సాధించాలని సూచించారు. కార్యక్రమాల్లో సంగెం కేజీబీవీ ప్రత్యేక అధికారి నీలిమ, చెన్నారావుపేట హాస్టల్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ గ్లోరీ, నెక్కొండ కేజీబీవీ ఎస్‌ఓ సునీత, ఎంఈఓ రాము, ఎంపీఓ కొమురయ్య, పంచాయతీ కార్యదర్శులు రవీందర్, వాజీద్, వార్డెన్ నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ స్టౌ, మిక్సీ..

చెన్నారావుపేట : మండలంలోని జల్లి గ్రామానికి చెందిన సొసైటీ మాజీ వైస్ చైర్మన్ తొగరు చెన్నారెడ్డి అతడి తల్లిదండ్రులు గోవర్ధన్‌రెడ్డి-విజయ జ్ఞాపకార్థం అమీనాబాద్‌లోని మోడల్ స్కూల్ హాస్టల్‌కు గ్యాస్ స్టౌ, మిక్సీ అందజేశారు. ఈ సందర్భంగా హాస్టల్ ఇన్‌చార్జ్ స్పెషల్ ఆఫీసర్ మెట్టుపల్లి జ్యోతి మాట్లాడారు. హాస్టల్‌కు స్టౌ, మిక్సీ అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రవంతి, ఏఎన్‌ఎం రోజా, కాంగ్రెస్ నాయకులు బుర్రి మోహన్, వంగపండ్ల చిన్న రాజు, మండల భాస్కర్, మేడి సుధాకర్, మిల్కూరి అశోక్‌రెడ్డి, మల్లాడి వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట : విద్యార్థులతో క్లబ్ ప్రతినిధులు



నెక్కొండ : మాట్లాడుతున్న అనురాధ

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

వర్ధన్నపేట : లయన్స్ క్లబ్ ఆఫ్ థౌజెండ్ పిల్లర్స్ హన్మకొండ జీఎస్టీ కోఆర్డినేటర్ రేవూరి రమణారెడ్డి మండలంలోని కట్య్రాల ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న 25 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఇష్టంతో చదివితే లక్ష్యాలను సాధించడం సులువని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, పీఈటీ సోమన్న, క్లబ్ ఉపగవర్నర్ నరహరి సుధాకర్‌రెడ్డి, అధ్యక్షుడు చొప్పరి సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గీసుకొండ : మండలంలోని గొర్రెకుంట శివారులోని పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడి చేసి పేకాడుతున్న పులిచేరి రాజేశ్, నల్ల కుమార్, బోనగిరి శ్రీనివాస్, పప్పుల రాజ్‌కుమార్‌లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.8 వేల 670 నగదుతోపాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులతోపాటు నగదు, పేక ముక్కలను స్థానిక పోలీసులకు అప్పగించినట్టు టాస్క్‌ఫోర్స్ సీఐ రంజిత్‌కుమార్ చెప్పారు. కూతాటి మధు, తొగిరి కిరణ్, దేవర వినయ్, తదితరులు పరారీలో ఉన్నట్టు సీఐ చెప్పారు. దాడిలో ఎస్సై దిలీప్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ హైస్కూల్‌లో ముగ్గుల పోటీలు



చెన్నారావుపేట : ముగ్గులు వేస్తున్న విద్యార్థులు



పర్వతగిరి : పోటీలను ప్రారంభిస్తున్న మల్లయ్య

చెన్నారావుపేట : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని పాపయ్యపేట గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేశారు. పాఠశాలలో పండుగ వాతావరణాన్ని తలపింపజేశారు. పోటీలో ఏడో తరగతి విద్యార్థిని చైత్రిక స్నేహిత మొదటి స్థానంలో నిలవగా ఆమెకు హెచ్‌ఎం ప్రభాకర్‌రావు బహుమతి అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, వెంకటరమణ, భిక్షపతి, హరి, శ్రీనివాస్, షాహేదా బేగం, మధు, నర్సింహరాములు తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండలో యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించగా హితకారిణి సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గటిక మల్లయ్య ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని చెప్పారు. అనంతరం క్రికెట్ టీంకు టీ షర్టులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బొల్లం రాకేశ్, మియపురపు వేణుగోపాల్‌చారి, అనిల్, రాము, మహేశ్, రాజు, టోనీ, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

‘కదంబ’లో నాచినపల్లి విద్యార్థుల సందడి



వరంగల్ ఆకాశవాణి కేంద్రం వద్ద ఉపాధ్యాయులతో విద్యార్థులు

దుగ్గొండి : వరంగల్ ఆకాశవాణి కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కదంబ కార్యక్రమంలో మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు సందడి చేశారు. ఆదివారాల్లో ప్రసారమయ్యే ‘చిన్నారిలోకం’ కార్యక్రమంలో భాగంగా స్కూల్ విద్యార్థులు జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు వెల్దండి సుమలత స్వయంగా రూపొందించిన దేశభక్తి గేయాలు, పర్యావరణ పరిరక్షణ సందేశం, రోబానా మజాకా, ఇతర సందేశాత్మక గీతాలను ఆపించగా ఆకాశవాని కేంద్రంలో రికార్డు చేశారు. ఈ కార్యక్రమం రానున్న ఆదివారం ప్రసారం కానుందని ఉపాధ్యాయురాలు వెల్దండి సుమలత తెలిపారు.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని బందనపల్లి చుక్క కుమార్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం పరామర్శించారు. తొలుత గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు కక్ర రవీందర్‌రెడ్డిని అతడి తల్లి అమృతమ్మ మృతి చెందిన క్రమంలో పరామర్శించారు. అమృతమ్మ మృతదేహానికి నివాళులర్పించి అంత్యక్రియలకు హాజరయ్యారు. అలాగే మండలంలోని ఏకేతండాలో మాజీ సర్పంచ్ మూడు రంగమ్మ కుమారుడు చక్రు అనారోగ్యంతో మృతి చెందగా చక్రు మృతదేహానికి నివాళులర్పించారు. తదనంతరం వెంకటేశ్వరపల్లిలో షేక్ నన్నే మృతి చెందగా అతడి అంతిమయాత్రలో పాల్గొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహనాయక్, జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, నాయకులు జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్‌గౌడ్, పూస మధు, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘గుడిసెవాసులకు పట్టాలివ్వాలి’

నర్సంపేట : పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లోని గుడిసెవాసులకు పట్టాలివ్వాలని మహిళా పోరాట కమిటీ నాయకులు అల్లం రాజక్క, గండికోట సమ్మక్కలు కోరారు. ఈ మేరకు వారు గుడిసెవాసుల కాలనీని గురువారం వారు సందర్శించి మాట్లాడారు. పట్టణంలోని సర్వే నంబర్ 111లోని ఎన్టీఆర్ నగర్‌లో గుడిసెలు వేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ దళిత ప్రజలకు ఆ భూములను సర్వే చేసి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సామంతుల మౌనిక, మొద్దు కోమల, రాసమల్ల నర్సమ్మ, మమత, నర్సమ్మ, ఎల్లమ్మ, మమత, సంధ్య,తదితరులు ఉన్నారు.

‘ఏజెన్సీలో కట్టడాలు, వెంచర్లను తొలగించండి’

నర్సంపేట : ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలోని నర్సంపేట మండలం రాజేపేట ఏజెన్సీ గ్రామ పంచాయతీ పరిధిలో చట్టానికి విరుద్ధంగా నిర్మించిన ఇండ్లను, కట్టడాలను, వెంచర్‌లను తొలగించాలని లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసు నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1/70, పీసా, తదితర ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కుతూ గిరిజనేతరులు నిర్మాణాలు చేపడుతున్నారని చెప్పారు. సమావేశంలో నాయకులు బీమ్లానాయక్, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులను ఆదుకోవాలని వినతి




గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని 15వ డివిజన్ గొర్రెకుంట ప్రధాన రహదారి విస్తరణలో ఇండ్లు, భూములు కోల్పోయిన నిర్వాసితులు న్యాయం కోరుతూ కలెక్టరేట్ ఏఓ విశ్వనాథ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మీడియాతో మాట్లాడారు. తమకు 120 గజాల స్థలంతోపాటు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డికి, తహసీల్దార్ రియాజుద్దీన్‌కు సైతం వినతిపత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు ల్యాదల్ల ఆనందం తదితరులు పాల్గొన్నారు.

చైతన్యయుత పెట్టుబడులతో లబ్ధి

నర్సంపేట రూరల్ : చైతన్యయుత పెట్టుబడులతో లబ్ధి చేకూరుతుందని సెబి స్మార్ట్ ట్రెయినర్ ప్రత్యూశ్ భాస్కర్ తెలిపారు. నర్సంపేట మండలంలోని లక్నెపల్లి గ్రామ శివారులోని బాలాజీ విద్యాసంస్థల్లో ఎంబీఏ విద్యార్థుల కోసం గురువారం నిర్వహించిన ఇన్వెస్టర్ అవేర్నెస్ ప్రోగ్రామ్‌ను చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి ప్రారంభించగా భాస్కర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశలోనే పెట్టుబడులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఏ రంగంలో పెట్టుబడి పెట్టాలి? లాభం పొందడం ఎలా? తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వివిధ రకాల ఫైనాన్సియల్స్ టూల్స్, తదితరాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థుల సమస్యలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో బిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్, బిట్స్ ప్రిన్సిపాల్ హరిహరన్, ఏసీ నారాయణ, ఏఓ సురేశ్, బిట్స్ హెచ్ఓడీ నరేశ్, బిమ్స్ హెచ్ఓడీ గోపీకృష్ణ, ప్రోగ్రాం కన్వీనర్ భరత్, తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా



వర్ధన్నపేట : కర్ర లోడుతో వెళ్తున్న లారీలో మండలంలోని ఇల్లంద శివారులోని జాతీయ రహదారిపై గురువారం బోల్తా పడింది. వివరాలిలా.. భారీ కర్ర లోడుతో వెళ్తున్న లారీ వరంగల్-ఖమ్మం రహదారిపై వరంగల్ దిశగా ప్రయాణిస్తూ బోల్తా పడింది. లోడు సైతం అధికంగా ఉండి ప్రయాణంలోనే లారీ రోడ్డు పక్కకు ఒరిగి పడిపోయింది. ఈ క్రమంలో డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలపాలయ్యారు.

ఆర్థికసాయం

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లికి చెందిన సాంబాచారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ తరఫున నాయకులు గురువారం రూ.10 వేల సాయం అందజేశారు. తొలుత సాంబాచారి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ కార్యదర్శి వేముల రవీందర్ రెడ్డి, నాయకులు కొమ్మెర మల్లన్న, శ్రీరామోజు రమేశ్, రాకేశ్, కొమ్మెర దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ రూరల్ :
9951602875 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. రాజు యాదవ్ (S.R) : 9502950309 (వర్ధన్నపేట
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944